క్లుప్తంగా

నీటి సమస్యను పరిష్కరించాలి

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌ : నగరంలో నెలకొన్న మంచి నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆర్‌సీపీ నగర కార్యదర్శి మగ్బూల్‌ బాష పేర్కొన్నారు. బుధవారం నగరంలోని ఆర్‌సీపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరంలోని ఆగాడీ, సాయిపేట, కట్టకింద హరిజనవాడ, కమ్మరికుంట, ఖలీల్‌ నగర్‌ ప్రాంతాల్లో మంచి నీటి సమస్యతో జనం ఇబ్బందులు పడుతున్నారన్నారు. కమిషనర్‌ స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం


కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరం

కడప సెవెన్‌రోడ్స్‌ : కెనరా బ్యాంకు రీజినల్‌ కార్యాలయం ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. బ్యాంకు రీజినల్‌ మేనేజర్‌ కె.మురళీమోహన్‌ మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. శిబిరం ఏర్పాటులో సహకరించిన ప్రైమ్‌ ఆస్పత్రి, కుల్‌దీప్‌ ఆస్పత్రి యాజమాన్యాలకు కృతజ్ఞతలు తెలిపారు. సుమారు 250 మంది పాల్గొని వైద్య సేవలు పొందినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో లీడ్‌ డిస్ట్రిక్ట్‌ చీఫ్‌ మేనేజర్‌ ఎస్‌.దుర్గాప్రసాద్‌, కెనరా బ్యాంకు రీజినల్‌ కార్యాలయ మార్కెటింగ్‌ సిబ్బంది కుందన్‌ ప్రకాశ్‌ ద్వివేది, జీవన్‌జ్యోతి బిశ్వాల్‌, కలెక్టరేట్‌ ఏఓ విజయ్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ పార్టీని బలోపేతం చేయాలి

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌ : నగరంలో బూత్‌ స్థాయిలో కాంగ్రెస్‌ పార్టీని బలోపేతం చేయాలని యూత్‌ కాంగ్రెస్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుమలేష్‌ పేర్కొన్నారు. బుధవారం 5వ డివిజన్‌లో యూత్‌జోడో బూత్‌ జోడో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో యువతే కీలక పాత్ర పోషిస్తుందన్నారు. యువతకు రాజకీయ అవకాశాలు ఇచ్చే ఏకైక పార్టీ కాంగ్రెస్‌ అన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి బూత్‌లో ఐదు మందితో కూడిన కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో యూత్‌ కాంగ్రెస్‌ జిల్లా అధ్యక్షుడు బండి సుమంత్‌ కుమార్‌, నాయకులు పాల్గొన్నారు.

దొరల గోరీలు చరిత్రకు సాక్ష్యం

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌ : దొరలగోరీలు చరిత్రకు సాక్ష్యమని ఆర్‌సీపీ నగర కార్యదర్శి వర్గ సభ్యులు ప్రసాద్‌ పేర్కొన్నారు. బుధవారం నగరంలోని ఆర్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చరిత్రకు సాక్ష్యమైన దొరల గోరీలను తొలగించవద్దన్నారు. వీటికి వందల ఏళ్ల నాటి చరిత్ర ఉందని జిల్లా ఏర్పడక ముందే ఆనాటి బ్రిటిష్‌ దొరల సమాధులు ఉన్నాయన్నారు. పురావస్తు శాఖ దొరల గోరీలను పరిరక్షించాలన్నారు.

ఉక్కాయపల్లె ఎకో పార్కులో సందర్శకులకు అనుమతి

కడప కార్పొరేషన్‌ : కడప నగరం మాచుపల్లి రోడ్డులో ఉన్న ఉక్కాయపల్లె ఎకో పార్కులో సందర్శకులకు అనుమతి ఇస్తున్నట్లు నగరపాలక హార్టికల్చర్‌ ఏడీ అనిల్‌ కుమార్‌ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకూ, సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకూ వాకర్లు, పిల్లలకు టికెట్‌ లేకుండా అనుమతిస్తున్నామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వైఎస్సార్‌ సంపూర్ణ పోషణ పంపిణీ

కడప కార్పొరేషన్‌ : కడప నగరంలోని 30వ డివిజన్‌ నాగరాజుపేట అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణీలు, బాలింతలకు వైఎస్సార్‌ సంపూర్ణ పోషణ కింద పౌష్టికాహారం అందజేశారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్‌ ఎస్‌ఎండీ షఫీ ముఖ్య అతిథిగా హాజరై రేషన్‌, గుడ్లు, నూనె పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, ఆశాలు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో ఆర్డీఓ విచారణ

కొండాపురం : మండల పరిధిలోని డాక్టర్‌ అంబేడ్కర్‌ గురుకుల విద్యార్థునులకు సరైన వసతులు కల్పించడంలో గత డిప్యూటేషన్‌లో వచ్చి ప్రిన్సిపాల్‌ నిర్లక్ష్యం వచ్చేవారని తెలిసిన ఆర్డీఓ శ్రీనివాసులు బుధవారం గురుకుల పాఠశాలలో విచారణ చేపట్టారు. గతంలో డిప్యూటేషన్‌ ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహించిన పరిమళ విద్యార్థులకు సరైన వసతులు కల్పించడంలో నిర్లక్ష్యం వహించారని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. ఈ విషయమై పాఠశాల సిబ్బందిని, పిల్లల తల్లిదండ్రులను విచారించారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్‌ శోభనబాబు, ఉప తహసీల్దార్‌ మీనా, రీసర్వే డీటీ రాజేశ్వరి, ప్రస్తుత ప్రిన్సిపాల్‌ క్రిష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కడప రాయుని కల్యాణం


కల్యాణమూర్తులుగా స్వామి, అమ్మవార్లు


కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

కడప కల్చరల్‌ : దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం శ్రవణానక్షత్రం సందర్భంగా ఆలయ ఇన్‌స్పెక్టర్‌ ఈశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు మచ్చా శేషాచార్యులు, తివిక్రమ్‌, కృష్ణమోహన్‌, సాయి తదితరులు ఈ సందర్భంగా ఉభయదేవేరులతో సహా స్వామి ఉత్సవ మూర్తులకు అభిషేకం నిర్వహించి పట్టు వస్త్రాలు, సువర్ణ ఆభరణాలతో కనుల పండువగా అలంకరించి కల్యాణ పీఠంపై కొలువుదీర్చారు. అనంతరం కల్యాణ వేడుక నిర్వహించారు. హాజరైన భక్తులందరికీ వేదాశీస్సులు అందజేసి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కల్యాణోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయ సంప్రదాయంలో భాగంగా అన్నదానం నిర్వహించారు. మధ్యాహ్నం కల్యాణోత్సవానికి హాజరైన భక్తులకు కడప నగరానికి చెందిన బి.శేషగిరిరావు దంపతులు అన్నదానం చేశారు. అనంతరం కల్యాణమూర్తులను పల్లకీపై కొలువుదీర్చి మాఢవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు.

బొటానికల్‌ గార్డెన్‌లో అంతరించిపోయే జాతుల సంరక్షణ

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయంలోని బొటానికల్‌ గార్డెన్‌లో విభిన్న జాతులకు చెందిన మొక్కలు, అంతరించిపోతున్న జాతుల సంరక్షణ చేపట్టడం అభినందనీయమని వైవీయూ వైస్‌ చాన్సలర్‌ ఆచార్య చింతా సుధాకర్‌ పేర్కొన్నారు. బుధవారం వైవీయూలోని బొటానికల్‌ గార్డెన్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ప్రపంచంలోనే అతి పెద్ద పత్రమైన విక్టోరియా అమెజానియా కొలను ఏర్పాటు చేయడం ద్వారా సందర్శకులు పెరిగారన్నారు. గార్డెన్‌ సందర్శనకు వచ్చే విద్యార్థులకు తాగునీటి సదుపాయం, మరుగుదొడ్లు నిర్మిస్తామన్నారు. గార్డెన్‌ను సందర్శించేలా కళాశాలలు, పాఠశాలల్లో అవగాహన కల్పించాలని సూచించారు. గార్డెన్‌ సమన్వయకర్త ఆచార్య ఎ.మధుసూధన్‌రెడ్డి గార్డెన్‌ గురించి వివరించారు.


వైవీయూ బొటానికల్‌ గార్డెన్‌లోని కొలనును పరిశీలిస్తున్న వీసీ ఆచార్య చింతా సుధాకర్‌

స్కాలర్‌షిప్‌ ప్రక్రియలో అసౌకర్యం తలెత్తకూడదు..

విశ్వవిద్యాలయంలోని విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లకు సంబంధించి ఎలాంటి అసౌకర్యం తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని వీసీ ఆచార్య చింతా సుధాకర్‌ సిబ్బందిని ఆదేశించారు. గురువారం ఆయన ఉపకార వేతనాల విభాగాన్ని, హాస్టల్స్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేష్టం

కడప కోటిరెడ్డిసర్కిల్‌ : తల్లిపాలు బిడ్డకు శ్రేష్టమని నాగరాజుపేట కమ్యూనిటీ సెంటర్‌ వైద్యులు హర్షవర్దన్‌ తెలిపారు. బుధవారం హెల్త్‌ ఎడ్యుకేటర్‌ ప్రసన్నలత ఆధ్వర్యంలో నగరంలోని నాగరాజుపేట సెక్టార్‌–1లోని అంగన్వాడీ కేంద్రాలను, చెన్నూరు అరుంధతినగర్‌లో ఇంటింటి సర్వే నిర్వహించి చిన్నారులకు వ్యాక్సిన్‌ వేయించారు. ఈ సందర్భంగా హర్షవర్దన్‌ మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని, తల్లిపాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. పిల్లలకు కనీసం ఆరు నెలల వరకు తల్లిపాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం లలిత, మహిళా పోలీసు సుజాత పాల్గొన్నారు.

6న జిల్లాస్థాయి చదరంగం టోర్నమెంట్‌

కడప స్పోర్ట్స్‌ : కడప నగరం మస్తాన్‌వలీవీధిలోని చదరంగం హాల్‌లో ఈనెల 6వ తేదీ ఆదివారం 19వ అష్రఫ్‌–ప్రసన్న మంత్రీ రోలింగ్‌ షీల్డ్‌ చెస్‌ టోర్నమెంట్‌ నిర్వహిస్తున్నట్లు జిల్లా చదరంగం సంఘం కార్యదర్శి అనీస్‌ దర్బారీ తెలిపారు. పూర్తి వివరాలకు 8341255151 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

జీతాలను సకాలంలో విడుదల చేయాలి

కడప ఎడ్యుకేషన్‌ : క్యాడర్‌ స్ట్రెంత్‌ అప్‌డేట్‌ పేరుతో బదిలీ, పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు రెండు మాసాల నుంచి జీతాలు ఇవ్వకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నారని యూటీఎఫ్‌ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విజయ్‌ కుమార్‌, పాలెం మహేష్‌బాబులు అన్నారు. ఇందుకు నిరసనగా ఆగస్టు 4వ తేదీన డీఈఓ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కడప యూటీఎఫ్‌ భవన్‌లో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సివి రమణ, నాయకులు కిరణ్‌ కుమార్‌, శివశంకర్‌ తదితరులు పాల్గొన్నారు.

మెగా జాబ్‌ మేళాను విజయవంతం చేయండి

కమలాపురం : స్థానిక సీఎస్‌ఎస్‌ఆర్‌ అండ్‌ ఎస్‌ఆర్‌ఆర్‌ఎం డిగ్రీ, పీజీ కళాశాలలో ఈనెల 4వ తేదీన ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏపీఎస్‌ఎస్‌డీసీ పర్యవేక్షణలో జరగనున్న మెగా జాబ్‌ మేళాను విజయవంతం చేయాలని వైఎస్సార్‌ సీపీ మండల కన్వీనర్‌ ఉత్తమారెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేళాకు కియా మోటర్స్‌, ఇండియా, షిర్డిసాయి ఎలక్ట్రికల్స్‌, ట్రయో విజన్‌ కాంపోజిట్‌ టెక్నాలజీస్‌, అపోలో, ఫార్మసీ, గ్రీన్‌ టెక్‌ ఇండస్ట్రీస్‌, ఏఐఎల్‌ డిక్సన్‌, ఆల్‌సెట్‌ బిజినెస్‌, అమర రాజా బ్యాటరీ, వినూత్న ఫర్టిలైజర్స్‌ వంటి 15 ప్రముఖ కంపెనీలు వస్తున్నాయన్నారు. టెన్త్‌, ఇంటర్‌, డిగ్రీ, డిప్లమో, అభ్యర్థులు హాజరు కావచ్చన్నారు. పూర్తి వివరాలకు 9912115622, 9063623706 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

షార్ట్‌ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని మేదరవీధిలో పక్కీరయ్యకు చెందిన తాళం వేసిన ఇంట్లో బుధవారం సాయంత్రం అగ్నిప్రమాదం జరిగింది. విద్యుత్‌ షార్ట్‌ సర్క్యూట్‌ వల్ల ఫ్రిజ్‌లో నుంచి మంటలు వ్యాపించాయి. ఇంట్లో నుంచి పొగ రావడంతో టిఫిన్‌ నిర్వాహకుడు సుబ్బరాయుడు స్థానికులతో కలిసి ఇంటి తాళాలను పగులకొట్టి కిటికీలు తెరిచారు. తర్వాత నీళ్లతో మంటలను ఆర్పారు. అగ్నిప్రమాదంలో ఫ్రిజ్‌తో పాటు వస్తువులన్నీ కాలిపోయాయి. అగ్నిమాపక అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు.

అసైన్‌మెంట్‌ భూములు పంపిణీ చేయాలి

ఒంటిమిట్ట : మండలంలోని ఒంటిమిట్ట రెవెన్యూ భూమి సర్వే నంబర్‌ 2050లో ఒంటిమిట్ట, మృకుందాశ్రమం, కొత్త మాధవరం గ్రామాలకు చెందిన 150 కుటుంబాలకు చెందిన అర్హులైన పేదలకు త్వరలోనే జరగబోయే అసైన్‌మెంట్‌ కమిటీ సమావేశంలో ప్రభుత్వ భూమిని మంజూరు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కె.నరసయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి అన్వేష్‌ డిమాండ్‌ చేశారు. బుధవారం ఒంటిమిట్టలో తహసీల్దార్‌ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

రామాలయం మండపానికి భూమిపూజ

సిద్దవటం : మండలంలోని చలమారెడ్డి కొట్టాలు గ్రామం బీసీ కాలనీలో బుధవారం రామాలయం మండపం నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు మేడా విజయశేఖర్‌ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలి

కడప కార్పొరేషన్‌ : రాష్ట్రంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని జర్నలిస్టు అసోసియేషన్‌ ఆఫ్‌ ఆంధ్రప్రదేశ్‌(జాప్‌) రాష్ట్ర సలహా మండలి సభ్యులు గుండ్రాతి విజయ్‌ కుమార్‌, జిల్లా వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ ఎస్‌వీ రమణ, రాష్ట్ర నాయకులు జ్యోతి జార్జ్‌, కె. ఆనంద్‌ కోరారు. బుధవారం ప్రెస్‌ అకాడమీ ఛైర్మన్‌ కొమ్మినేని శ్రీనివాసరావుకు వారు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నపత్రికల్లో పనిచేసే జర్నలిస్టులకు గతంలో జిల్లాలో ఒకరికి అక్రిడిటేషన్‌ ఇచ్చేవారని, ప్రస్తుతం ఇవ్వడం లేదన్నారు. ఈ వృత్తిలోనే కొనసాగుతూ వార్తలు సేకరిస్తున్న వారికి ఫ్రీలాన్స్‌ జర్నలిస్ట్‌ అక్రిడిటేషన్‌ ఇవ్వాలన్నారు. వీక్లీ, పక్ష, మాస పత్రిక ఎడిటర్లకు గతంలో ఉన్న విధంగా స్టేట్‌ బస్‌పాస్‌ ఇవ్వాలని, ఏసీ బస్సుల్లో కూడా అనుమతించాలని కోరారు. రిటైర్డ్‌ అయిన జర్నలిస్టులకు పెన్షన్‌, పదిలక్షల ఉచిత బీమా సౌకర్యం కల్పించాలన్నారు. రైళ్లలో రాయితీని పునరుద్ధరించాలన్నారు. జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో 50 శాతం ఫీజు రాయితీని అమలు చేయాలన్నారు. దీనిపై కొమ్మినేని స్పందిస్తూ ఈ విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి పరిష్కరించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

శిల్పారామంలో సిట్టింగ్‌ షెల్టర్లు

కడప కల్చరల్‌ : కడప శిల్పారామం కొత్త అందాలను సంతరించుకోనుంది. సందర్శకులకు నిర్వాహకులు మెరుగైన వసతులు కల్పించంలో భాగంగా సిట్టింగ్‌ షెల్టర్లను ఏర్పాటు చేస్తున్నారు. అందులో మరిన్ని ఆకర్షణలు కల్పించడంలో భాగంగా ఇప్పటికే చిల్డ్రన్స్‌ జోన్‌ వద్దనుంచి పడమటివైపున దుకాణ సముదాయం చివరి వరకు అండర్‌ గ్రౌండ్‌ వైరింగ్‌ చేశారు. త్వరలో చిల్డ్రన్స్‌ జోన్‌ను అక్కడికి తరలించనున్నారు. ప్రస్తుతం శిల్పారామం సంప్రదాయ వేదిక వద్ద ఒకటి, చిల్డ్రన్స్‌ జోన్‌ వద్ద మరొకటి సిట్టింగ్‌ షెల్టర్లను నిర్మించనున్నారు. ఈ మేరకు ఇప్పటికే పునాదుల స్థాయిలో పనులు జరుగుతున్నాయి. ఈ విషయంగా శిల్పారామాల రాష్ట్ర పాలనాధికారి మునిరాజు ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. సిట్టింగ్‌ షెల్టర్ల పనులు పునాదులు దాటాక పైభాగమంతా రాజస్థాన్‌ మర్బ్బుల్‌, గ్రానైట్‌ రాతితో అందంగా నిర్మించనున్నారు. ఇందుకోసం ఆ ప్రాంతాల నుంచే ఈ పనిలో నిపుణులైన కార్మికులను రప్పించనున్నారు. ఈ పనులు పూర్తయితే శిల్పారామం మరింత ఆహ్లాదాన్ని అందించగలదు. కడప నగరంతోపాటు పులివెందుల శిల్పారామంలో కూడా ఇలంటి ఆధునిక వసతులను కల్పించేందుకు అధికారులు పనులు చేపట్టారు.


శిల్పారామంలో కొనసాగుతున్న సిట్టింగ్‌ షెల్టర్ల పనులు

పురుగుమందుల దుకాణాలపై విజిలెన్స్‌ దాడులు

కడప అగ్రికల్చర్‌ : కడప నగరంలో బుధవారం విజిలెన్స్‌ అండ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ అధికారులైన రెడ్డెప్ప, ఈదురుబాషలు కడప మండల వ్యవసాయ అధికారి సురేష్‌ కుమార్‌రెడ్డితో కలిసి పలు ఎరువుల దుకాణాలపై దాడులు నిర్వహించారు. ఇందులో భాగంగా నగరంలోని నవ్య ఆగ్రోస్‌ ఏజెన్సీస్‌, లక్ష్మి పెస్టిసైడ్స్‌ ఎరువులు మరియు పురుగు మందుల దుకాణాలలో తనిఖీ చేశారు. ఇందులో నవ్య ఆగ్రో ఏజెన్సీసనందు రూ. 3,01,100 విలువ చేసే బయో స్టిమ్‌లెంట్లకు సంబంధించి ఎరువులు స్వాధీనం చేసుకుని వ్యవసాయ అధికారికి అప్పగించారు. అలాగే తిరుమల ఆగ్రో సెంటర్‌లో పురుగుమందులు స్టాక్‌కు సంబంధించి అప్‌డేట్‌ చేయనందున రూ.27,12,970లకు సంబంధించిన 596 లీటర్లు, 152 కేజీల బయో స్టిమ్‌లెంట్ల అమ్మకాలను నిలుపుదల చేశామన్నారు. ఈ తనిఖీల్లో అగ్రికల్చర్‌ అధికారులు బాలగంగాధర్‌రెడ్డి, సురేష్‌కుమార్‌రెడ్డి, ఏఈఈ కిషోర్‌ తదితరులు పాల్గొన్నారు.


ఎరువుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న విజిలెన్స్‌ అధికారులు

స్పెషల్‌ గ్రేడ్‌ మున్సిపాలిటీగా రాయచోటి

రాయచోటి అర్బన్‌ : రాయచోటి మున్సిపాలిటీ హోదా పెరిగింది. ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి ప్రత్యేక కృషితో స్పెషల్‌ గ్రేడ్‌ మున్సిపాలిటీగా అప్‌ గ్రేడ్‌ అయింది. రాయచోటిని గ్రేడ్‌–1 నుంచి స్పెషల్‌గ్రేడ్‌ మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్‌ చేస్తూ జీఓ ఎంస్‌ నంబర్‌ 104 పేరుతో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో గ్రేడ్‌ –3 మున్సిపాలిటీగా ఉన్న రాయచోటిని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పట్టుపట్టి గ్రేడ్‌–1 చేయించారు. ప్రస్తుతం స్పెషల్‌ గ్రేడ్‌గా అప్‌గ్రేడ్‌ చేయించారు. గ్రామపంచాయతీగా ఉన్న రాయచోటి దివంగత ముఖ్యమంత్రి వైఎస్‌ఆర్‌ హయాంలో 2005వ సంవత్సరం ఏప్రిల్‌ 24న గ్రేడ్‌–3 మున్సిపాలిటీగా అవతరించింది. మున్సిపాలిటీ 31 వార్డులుగా ఏర్పడింది. వైఎస్‌ జగన్‌ ప్రభుత్వం ఏర్పడిన తరువాత 3 ఏళ్ల క్రితం ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ప్రత్యేక కృషి చేసి రాయచోటి మున్సిపాలిటీని గ్రేడ్‌–3 నుంచి గ్రేడ్‌–1కు అప్‌గ్రేడ్‌ చేయించారు. వార్డులు కూడా 34కు పెరిగాయి. కొత్త జిల్లాల ఆవిర్భావం సమయంలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి రాయచోటిని జిల్లా కేంద్రంగా చేయించడం ద్వారా రాయచోటికి రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపును తీసుకువచ్చారు. రాయచోటిని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకురావాలన్న పట్టుదలతో ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి సారించడంతో మున్సిపాలిటీని గ్రేడ్‌–1 నుంచి స్పెషల్‌గ్రేడ్‌గా అప్‌ గ్రేడ్‌ చేయించారు. అన్నమయ్య జిల్లాలో మదనపల్లె మున్సిపాలిటీతో సమానంగా రాయచోటి మున్సిపాలిటీ స్పెషల్‌గ్రేడ్‌గా అప్‌గ్రేడ్‌ కావడం పట్ల ప్రజలు ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం రాయచోటి మున్సిపాలిటీ ఆదాయం రూ. 6 కోట్లకు పైబడి ఉంది. పట్టణంలో సుమారు లక్షా పదివేలకు పైగా జనాభా ఉంది. నిత్యం చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పట్టణానికి వేల సంఖ్యలో ప్రజలు వచ్చి వెళుతుంటారు. పట్టణ ప్రజలకు మున్సిపాలిటీ ద్వారా అందించే సేవలు, అభివృద్ధి పనులు పెరగాలంటే స్థానికంగా సమకూరే నిధులతో పాటు కేంద్ర – రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా అందజేసే నిధులు అవసరమవుతాయి. మున్సిపాలిటీలకు నిధుల కేటాయింపు, వివిధ పథకాలను అమలు పరిచే విషయంలో గ్రేడ్‌ –1 మున్సిపాలిటీల కంటే స్పెషల్‌గ్రేడ్‌ మున్సిపాలిటీలకు అధిక ప్రాధాన్యత ఉంటుంది. లక్షకు పైగా జనాభా ఉన్న రాయచోటి పట్టణ ప్రజలకు మున్సిపాలిటీ ద్వారా మరిన్ని సౌకర్యాలు అందించేందుకు స్పెషల్‌గ్రేడ్‌ మున్సిపాలిటీ అప్‌గ్రేడ్‌ కావడం ఎంతో దోహదపడుతుంది.


రాయచోటి మున్సిపల్‌ కార్యాలయ భవనం

కార్పొరేటర్లు, కార్యకర్తలతో ఎంపీ సమావేశం

కడప కార్పొరేషన్‌ : కడప నగరపాలక సంస్థ కార్పొరేటర్లు, కో ఆప్షన్‌ సభ్యులు, డివిజన్‌ ఇన్‌చార్జులతో కడప ఎంపీ వైఎస్‌ అవినాష్‌రెడ్డి, డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్‌ సురేష్‌ బాబు సమావేశమయ్యారు. స్థానిక రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహంలో నిర్వహించిన ఈ సమావేశంలో వారి సమస్యలు తెలుసుకొని, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడుతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు మాసీమబాబు, అఫ్జల్‌ఖాన్‌, డిప్యూటీ మేయర్‌ నిత్యానందరెడ్డి, ఏపీ సోషల్‌ వెల్ఫేర్‌ బోర్డు ఛైర్మన్‌ పులి సునీల్‌ తదితరులు పాల్గొన్నారు.


కడప ఎంపీ వైఎస్‌ అవినాష్‌రెడ్డితో కార్పొరేటర్లు, డివిజన్‌ ఇన్‌చార్జిలు

చంద్రబాబు సీమ ద్రోహి

ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌ రెడ్డి

కమలాపురం : ప్రతిపక్ష నేత చంద్రబాబు సీమ ద్రోహి అని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌ రెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారం మండలంలోని దేవరాజుపల్లెలో రూ. 20.80 లక్షల వ్యయంతో నిర్మించిన వైఎస్సార్‌ విలేజ్‌ క్లినిక్‌ను ఆయన ప్రారంభించారు. ముందుగా శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం అధికారులు, పార్టీ నాయకులతో కలసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌ రెడ్డి పేద ప్రజల ఆరోగ్యమే పరమావధిగా ప్రతి సచివాలయ పరిధిలో వైఎస్సార్‌ విలేజ్‌ క్లినిక్‌ను నిర్మించి వైద్య సేవలను ప్రజల ముంగిటకే తీసుకు వచ్చారన్నారు. ఫ్యామిలీ డాక్టర్‌ కాన్సెప్ట్‌తో ప్రజలకు వైద్య సేవలు మరింత దగ్గరయ్యాయన్నారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు సీమవాడైనా ఈ ప్రాంతానికి తీరని ద్రోహం చేశారని ధ్వజమెత్తారు. కేవలం ఒక్క పట్టిసీమ పేరు చెప్పి రాష్ట్రాన్ని గాలికొదిలేశారని మండి పడ్డారు. అది కూడా మహానేత వైఎస్సార్‌ తవ్విన కాలువలో నీళ్లు ఎత్తిపోశారన్నారు. అంతకు మించి చంద్రబాబు ఏమి చేశారో చెప్పాలని డిమాండ్‌ చేశారు. ఎన్నికలొచ్చే సమయానికి ప్రాజెక్టుల సందర్శన అని డ్రామాలు మొదలు పెట్టారన్నారు. ఏదైనా మాట్లాడితే సిగ్గు శరం ఉండాలన్నారు. ఛానల్స్‌, పత్రికలు ఉన్నాయని ఏది పడితే అది మాట్లాడకూడదని హితవు పలికారు. ప్రజలు ఈ సారి ఒక్క సీటు కూడా ఇవ్వకుండా టీడీపీని ఇంటికి పంపించడం ఖాయం అన్నారు. గాలేరు–నగరి, హంద్రీ–నీవాకు ఏమి చేశాడో బాబు చెప్పాలన్నారు. తెలుగు గంగ కాల్వల లైనింగ్‌ పనులన్నీ జగనన్న ప్రభుత్వమే చేయించిందన్నారు. గండికోట నిర్వాసితుల ఆర్‌అండ్‌ఆర్‌ ప్యాకేజీ కూడా జగనన్న ప్రభుత్వమే ఇచ్చిందన్నారు. ప్రజలు 14ఏళ్లు అవకాశం ఇస్తే నిర్లక్ష్యం చేసి ఇపుడు తమ ప్రభుత్వం పై బురద జల్లడం సరికాదన్నారు. చంద్రబాబు మాటలు నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌ సీపీ నాయకులు చెన్నకేశవరెడ్డి, కిరణ్‌రెడ్డి, సంబటూరు ప్రసాద్‌రెడ్డి, ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, సుమిత్రా రాజశేఖర్‌ రెడ్డి, ఎన్‌సీ పుల్లారెడ్డి, పీఆర్‌ ఏఈ వెంకటసుబ్బయ్య, మెడికల్‌ ఆఫీసర్‌ ప్రసూన, వైద్య ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌ రెడ్డి

మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

బద్వేలు అర్బన్‌ : మత్స్యకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్‌ సుధ పేర్కొన్నారు. బుధవారం స్థానిక బెస్తవీధిలోని సత్యమ్మ ఆలయం ఆవరణలో ఫిష్‌ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మంజూరైన (ఫిష్‌ వెండింగ్‌ వెహికల్‌) త్రీవీలర్‌ వాహనాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మత్స్య ఉత్పత్తుల వినియోగం పెంచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా సబ్సిడీపై నిరుద్యోగ యువతకు ఫిష్‌ వెండింగ్‌ వాహనాలను అందిస్తాయన్నారు. ఏదైనా కారణాల వలన చేపల ఎగుమతులు తగ్గినప్పుడు మత్స్యకారులు నష్టపోకుండా ఉండేందుకు ఈ ఫిష్‌ వెండింగ్‌ వాహనాలు ఉపయోగపడతాయని అన్నారు. ఈ వాహనంలో 200 కిలోల మత్స్య ఉత్పత్తులను నిల్వ చేసుకోవచ్చని, అలాగే 20 లీటర్ల సామర్థ్యం గల రెండు ఐస్‌బాక్స్‌లు, వేయింగ్‌ మిషన్‌, మైక్‌ సౌకర్యంతో పాటు మత్స్య ఉత్పత్తులను డ్రెస్సింగ్‌ చేయడానికి ప్రత్యేక ఏర్పాట్లు ఉన్నాయని అన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా మత్స్యకారుల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మత్స్యశాఖ ఉప సంచాలకులు కె.ఎస్‌.వి.నాగలింగాచారి, ఎఫ్‌డీఓ టి.మద్దిలేటి, మత్స్య సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు మిరప్పల్లె వెంకటరమణ, టూరిజం డెవలప్‌మెంట్‌ కార్పొరేషన్‌ డైరెక్టర్‌ అల్లాబకాష్‌, వార్డు కౌన్సిలర్‌ గానుగపెంట సమత, కో ఆప్షన్‌ మెంబర్‌ హసన్‌, వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ కన్వీనర్‌ యద్దారెడ్డి, మత్స్య సహకార సంఘం పట్టణ ఉపాధ్యక్షుడు నాగేంద్రరావు, సెక్రటరీ వెంకటయ్య, గౌరవ సలహాదారుడు వజ్రాల వెంకటస్వామి, డైరెక్టర్లు చంద్ర, శివశంకర్‌, సుబ్బన్న పాల్గొన్నారు.


ఫిష్‌ వెండింగ్‌ వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్‌ సుధ

రూ.3 కోట్లతో కేసీ ఉప కాలువల నిర్మాణాలు

చాపాడు : మండల వ్యాప్తంగా రూ.3కోట్ల వ్యయంతో కేసీ ఉప కాలువల నిర్మాణం చేపట్టారు. ఇప్పటికే పలు గ్రామాలలో పనులు పూర్తవగా మిగిలిన చోట్ల పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ క్రమంలో శ్రీరాములపేట గ్రామంలో రూ.8.80 లక్షలతో కేసీ కెనాల్‌కు ఉప కాలువ నిర్మాణం చేపట్టారు. ఇటీవల గ్రామంలో నుంచి వెళ్లే పంట కాలువ ద్వారా ఖరీఫ్‌ సీజన్‌లో గ్రామ ప్రజలు పలు రకాలైన ఇబ్బందులు పడేవారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి సహకారంతో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు నాగిరెడ్డి గ్రామం పొడవునా ఉన్న కేసీ పంట కాలువలో సిమెంట్‌ కాంక్రీట్‌ లైనింగ్‌ నిర్మించారు. దీంతో పాటు మండలంలోని అనంతపురం, రాజువారిపేట, పల్లవోలు, చియ్యపాడు, అన్నవరం, ఓబుళరెడ్డిపేట ఇంకా పలు గ్రామాల వద్ద కాలువల నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. పనులను కేసీ కెనాల్‌ అధికారులు పర్యవేక్షిస్తున్నట్లు ఏఈ జాన్సన్‌ తెలిపారు.


శ్రీరాములపేట గ్రామంలో పూర్తయిన కేసీ ఉప కాలువ

పులివెందుల బ్రాంచ్‌ కెనాల్‌కు నీటి విడుదల

వేముల : పులివెందుల బ్రాంచ్‌ కెనాల్‌కు(పీబీసీ) అధికారులు కొద్దిరోజుల క్రితం నీటిని విడుదల చేశారు. ఈ ఏడాది వర్షాభావం నెలకొనడంతో ఖరీఫ్‌లో సకాలంలో పంటలు సాగు కాలేదు. వర్షం కోసం ఎదురుచూసిన రైతులకు వరుణుడు కరుణించలేదు. దీంతో వర్షాధారం కింద పంటలు సాగయ్యే పొలాలన్ని బీళ్లుగానే ఉన్నాయి. ఇప్పటికే ఖరీఫ్‌లో వేరుశనగ సాగుకు సీజన్‌ ముగిసింది. దీంతో రైతులు స్వల్పకాలిక పంటలు సాగు చేసుకునేందుకు వీలుగా అధికారులు పులివెందుల బ్రాంచ్‌ కెనాల్‌కు నీటిని విడుదల చేశారు. పీబీసీ కింద, డిస్ట్రిబ్యూటరీల కింద రైతులు పంటలు సాగు చేసుకునేలా నీటిని విడుదల చేశారు. ఖరీఫ్‌ సీజన్‌ పూర్తయ్యే వరకు సాగునీరు అందించాలని అధికారులు నిర్ణయించారు. డిస్ట్రిబ్యూటరీల కింద ఇంజన్లు, విద్యుత్‌ సౌకర్యం ఉన్నట్లయితే మోటార్ల ద్వారా సాగునీటిని అందించేందుకు రైతులు సమాయత్తమవుతున్నారు. పులివెందుల బ్రాంచ్‌ కెనాల్‌ పరిధిలోని లింగాల, పులివెందుల, వేముల, వేంపల్లె మండలాల్లో పీబీసీ కింద ఉన్న రైతులు పంటల సాగు చేసుకునేందుకు సిద్ధమవుతున్నారు. కొంత మంది రైతులు పంటలు సాగు చేశాక నీటిని ఆపేస్తే పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. అయితే అధికారులు మాత్రం పీబీసీ, ఉప కాలువల కింద పంటలు సాగు చేసే పంటకాలం పూర్తయ్యే వరకు నీటిని విడుదల చేస్తామని అధికారులు భరోసా ఇస్తున్నారు. ఇప్పటికే పీబీసీ కింద పత్తి పంట సాగు చేసుకున్న రైతులు నీటిని విడుదల చేయడంతో ఇంజన్ల ద్వారా పత్తి పంటకు సాగునీటిని అందిస్తున్నారు. ప్రస్తుతం పీబీసీ కింద మినుము పంట సాగు చేసుకునేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఉప కాలువల కింద పంటలు సాగు చేసుకునేందుకు వీలుగా నీటిని విడుదల చేస్తున్నారు.


పులివెందుల బ్రాంచ్‌ కెనాల్‌లో పారుతున్న నీరు

సీజన్‌ చివరి వరకు నీటిని విడుదల చేస్తాం

ఖరీఫ్‌ సీజన్‌ ముగిసే వరకు పీబీసీకి నీటిని విడుదల చేస్తాం. ఇప్పటికే పీబీసీకి నీటిని విడుదల చేశాం. రైతులు ఎలాంటి సందేహం లేకుండా పీబీసీ కింద గానీ, ఉప కాలువల కింద పంటలు సాగు చేసుకోవచ్చు పంట కాలం పూర్తయ్యే వరకు సాగునీటిని అందిస్తాం. ఆందోళన లేకుండా పంటలు సాగు చేసుకోండి. ఖరీఫ్‌ వర్షాభావం నెలకొని పొలాలన్ని బీళ్లుగా ఉన్నాయి. వర్షాధారం కింద సాగయ్యే పొలాల్లో పీబీసీ నీటితో పంటలు సాగు చేయండి. సాగునీటిపై ఎవరూ ఆందోళణ పెట్టుకోవద్దు. పంటలు సాగు చేసినా రైతులను ఇబ్బంది పెట్టం.

– రాజశేఖర్‌ (పీబీసీ ఈఈ), పులివెందుల